చేతులెత్తిన ప్రజాస్వామ్యం

శ్రీమాన్ పరంధామయ్యగారు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు గిరికి పోటీ చేయబోతున్నారన్నవార్త గుప్పు మనగానే ఉల్లిపాలెంలో అణువుబాంబు పేలినంత పనయింది!

పార్లమెంటుకు పోటీ చేసిన (డిపాజిట్టు వచ్చిందా రాలేదాన్న విషయం వేరు!) పరంధామయ్యగారు "అవ్వ!" పంచాయతీబోర్డుకు నుంచోట మేమిటని జనం ముక్కుమీద వేలేసుకొని గుడ్లు మిటకరించారు! అందులో నారాయణ ముఠా వాళ్ళకు ముక్కుమీదగాదు మూతిమీదే కొట్టినట్టయింది!!

పార్లమెంటు ఎలక్షన్ల్ల నాటి దగ్గర్నుంచీ నారాయణకు పంచాయతీబోర్డు ప్రెసిడెంటు ఆశచూపి, పరంధామయ్య తన పబ్బం గడిపేస్తూ వచ్చాడు. నిన్నగాక మొన్న పార్టీకమిటీ ఎన్నికల్లోగూడా నారాయణ మన కాబోయే ప్రెసిడెంటని వుబకేశాడు. కాని యీ నిర్ణయం నారాయణ్ని వెనక్కు తిరగమని నడ్డి విరగొట్టినట్టయింది.

షావుకారు పరంధామయ్య అండతో యీసారి పంచాయతీబోర్డు ప్రెసిడెంటు తప్పక అవుతాననుకొన్న నారాయణ అప్పుడే ప్రెసిడెంటు అయిపోయినట్టు నడ్డి విరుచుకొని—అదేలేండి—రొమ్ము విరుచుకొని తిరగడం మొదలు పెట్టాడు. మొదట్లో "ఏం పెసరట్టూ ?" అని ఎగతాళిగా పిలిచిన జనం,

యిప్పుడు "ఏం ప్రెసిడెంటూ?" అనీ పిలిస్తేనేగాని వినపడ కుండా పోయింది నారాయణకు. ఐతే, పరంధామయ్య ప్రెసి డెంటు పదవికి తనే నుంచునే ప్రయత్నంలో వున్నాడనే సరికి నారాయణకి నడుములు జారిపోయినై. పిచ్చెత్తిన కుక్కలా నారాయణ బజార్న పడ్డాడు పరంధామయ్యను పేరు వరసలు పెట్టి తిట్టూ.

పరంధామయ్య మనుషులు నారాయణ నోటిమీద కొట్టే దాకా వచ్చేసరికి, చప్పున తగ్గి నారాయణ సందుదోవన పడ్డాడు కులం వాళ్ల వోట్లు అడుక్కుంటూ.

పరంధామయ్యా అలా అకస్మాత్తుగా తన నిర్ణయాన్ని మార్చుకోటానికూడా చాలా పెద్ద కారణాలే వున్నట్టు ఆయన మనుషులు అంటారు.

"ఈ నడుముల్లేని నారాయణ్ని నమ్ముకూర్చుంటే, యల్లమందయ్య కూలీ సంఘంవాళ్ళ తోడ్పాటుతో పీట కాస్తా ఎక్కేస్తాడు. యల్లమందయ్య కుర్చీ ఎక్కి కూర్చుంటే వూళ్లో రైతులు తలలెత్తుకు తిరగటానికేనా? కూలి గింజలు తెచ్చు కొనే యల్లమందయ్యగాడు ప్రెసిడెంటయితే గ్రామంలో ప్రజ మోహమెత్తుకు తిరగటానికేనా?"

— ఇదీ పరంధామయ్య మనుషుల ప్రచారధోరణి.

ఎలక్షన్‌రోజు ముందు పడుతూన్న కొద్దీ మూడు పార్టీల ప్రచారం ముమ్మరంగా సాగిపోతూంది.

యల్లమందయ్య పల్లెలో తన వాళ్ళల్లో ప్రచారం చేసు కొంటున్నాడు. కూలోడికి కూలోళ్ళు వోట్లిచ్చుకోకపోతే ఎవరిస్తారు? మన కూలి సంఘంవాళ్ళ వోట్లన్నీ యల్లమంద

య్యాకే అన్నాయి పెద్ద తలకాయ లన్నీ కూడపలుక్కుని పల్లెలో:

పోతే నారాయణ పోయినచోటల్లా "కులంవోడ్ని వదులుకుంటామా నారాయణా? నీ కా భయమెందుకు" ఏస్తాం పొమ్మన్నారు సాటికులపోళ్లు.

ఇహా పరంధామయ్యగారి మనుషులు పోయినచోట ప్రొహిబిషన్ లేకుండా పోయిందంటే నమ్మండి. రెండు చేతుల్తోనూ డబ్బు విరజిమ్మబడింది. ప్రామిసరీనోట్లు చెల్లుబడులూ, ట్రాన్స్ఫరులూ, పొలాలు కౌలు కివ్వడంలాంటి తతంగాలు అంతులేకుండా జరిగిపోతున్నాయి.

ఆ ఎలక్షన్ రోజు రానే వచ్చింది. ఆ క్రింతం రాత్రి ఎలక్షన్ జరిపించటానికి వచ్చిన ఆఫీసరుగారి బసకూ పరంధామయ్యగారింటికీ ట్రంక్ రోడ్డు ట్రాఫిక్ అయిపోయింది.

ఆ రాత్రి పరంధామయ్యగారింట్లో మెడకాయలు తెగిపోయినకోళ్ళూ, తల తెగిపోయిన మేకపోతులూ, తపతపా కిందపడి మెలికలుతిరిగి పోయినై! సీసాల బిరడాలు టప్ టప్న లేచిపోయినై! ఇనపెట్టెల్లోంచి రూపాయలు ఘల్లుమన్నయ్!!

ఉదయం పదిగంట లయేసరికి గ్రామచావిట్లోకి వోటర్లంతా చేరుకొన్నారు. ఎవరిమనుషుల్ని వారు వెంటేసుకొని ముఠాలు ముఠాలుగా వచ్చి చేరారు.

పల్లెనుంచి వచ్చిన వోటర్ల నందర్నీ ఒకచోట పోగుచేసి యల్లమందయ్యకు కుడిభుజంలాటి వాడైన ఏసోబు ఎట్లా వోటుచేయాల్సిందీనూ చెప్పాడు.

"యల్లమందయ్య పేరు చెప్పగానే మనోళ్ళంతా చేతు లెత్తాలి తెలిసిందా?"

తెలిసినా, తెలియకపోయినా అంతా తలలు మాత్రం వూపారు. అప్పుడే కొందరు చేతులు పైకెత్తికూడా చూసు కొన్నారు!

"ఒరేయ్! ఎర్రోడా నీకేరా! తెల్సిందీ?" ఏసోబు అడి గాడు.

"అదంతా నాకెందుకన! ఎర్రపెట్టెకే నా వోటంటా నన!" కండవా తలకుచుట్టుకొంటూ అన్నాడు యర్రోడు.

"వోరినీయమ్మ! నువ్వువోట్టి శాదినాయలివిరా? ఎర్ర పెట్టె యాడుందిరా యిక్కడ?" ఎంకటేసుగాడు యిదిలించే శాడు.

"ఒరేయ్! ఎర్రోడా! ఎర్రపెట్టెగాదురా ఎల్లమందయ్య అన్నపుడు చెయ్యెత్తాలిరా?" ఏసోబు మళ్ళీ చెప్పాడు.

"అదంతా నాకుతెల్దన! మీరంతా ఎప్పుడెత్తితే నే నప్పుడే నాదికూడా ఎత్తుతానపా!" అన్నాడు ఎర్రోడు అమాయకంగా.

"ఒరేయ్ ఎర్రోడా? అదంతా గాదు కానీ, నేనోరి కెత్తితే ఆరికెత్తరా! నువ్వు నా పక్కనే కూకో!" అని చిన్నోడు ఎర్రోణ్ని పక్కనకూరోచ్చె పెట్టుకొన్నాడు.

"ఏం ఏసోబయ్యోవ్! కర్రోడిక్కూడా కూత్తెసెప్పండి! ఆడసలు ఎర్రిసన్నోసి!" అన్నాడు నల్లోడు ఎంగిలిచుట్ట చెవు ల్లోంచి తీసుకుంటూ.

"ఒరేయ్ కర్రోడాయ్! యల్లమందయ్య పేరు లెగవ గానే చెయ్యెత్తాలి! తెలిసిందా?" చెప్పాడు ఏసోబు.

"ఓస్ అదేంది! వందచాల్లెత్తమన్నా ఎత్తుతా" అనేశాడు కర్రోడు.

"ఓరి శాదినాయలా. వొక్కసారే ఎత్తాలిరా? యింకోరి పేరొచ్చినా ఎత్తకూడదు!" వివరించి చెప్పాడు ఏసోబు.

"ఏందియ్యా! నువ్వుసెప్పేదీ? మన యల్లమందయ్యకు ఎత్తమనే కదయ్యా'' కర్రోడు అంతా తెలిసినట్టుగా అన్నాడు.

"ఆఁ అగ్దదే! అంతే!"

'ఓసి యింతేగా?' అంటూ కరోోడు రెండు చేతులూ ఎత్తి తెలివిగా చూశాడు.

"ఓరి పిచ్చినాయాలా!" అంటూ నెత్తిమీద వొక్కటి వేశాడు పక్కనున్నపోలాయి.

'అమ్మ నీయమ్మ! కొట్టావేంటిరా? అట్టయితే నేనోరికి ఎత్తను!"

"అదికాదస్! రెండుచేతులూ ఎత్తుతావెందుకు?" నిగ్గదీసి అడిగాడు పోలాయి. ఇంతలో పిల్లసుబ్బడికి ఏదో ధర్మసందేహం వచ్చినట్టుంది. ఏసోబు నడిగాడు.

"ఒక చెయ్యెత్తితే ఒక వోటుగందా? మరా లెక్కన రెండు చేతులెత్తితే రెండువోట్లు రావద్దంటయ్యామరి!"

"ఒరే పిల్లసుబ్బాయ్! రెండు చేతులున్నా మనిషికి ఒకే వోటురా!"

'అయితే వొంటిచెయ్యి మడిసికో?' కుంటిరాముడు జనంలోంచి కేకేశాడు. జనం అంతా గొల్లుమన్నారు.

ఏసోబుకు చెప్పలేక తలతిరిగి పోతోంది. జనాన్నంతా కలయజూశాడు. అందులో వొకడు చెయ్యిపైకెత్తుకు కూర్చొని వున్నాడు.

'అదేందిరా ఎంకిటిగా? యిప్పుడే చెయ్యెత్తు కూర్చున్నావేం?'

"ఆ గొడవంతా నీకు తెల్దు పసోబయ్యా! దీనమ్మ నాయాల్ది ఎట్టబోయి ఎట్టొత్తదోనని ముందే ఎత్తేసే!"

"వో రెర్రినాయాలఖానా. యిప్పుడుగాదురా యల్లమంధయ్య పేరు లెగిసినప్పు డెత్తాలిరా!" ఎంకిటిగాడి డొక్కలో వొక్క పోటుపొడిసి చెప్పాడు పక్కనున్న ఎర్రిగాడు,

రభసంతా చూసేసరికి ఎల్లమందయ్యకు మతిపోయినట్టయి పసోబు వంక చూశాడు. పసోబు గొంతు సవరించుకొని "కూలీసంఘం పరితినిధికే మావోటు!" గట్టిగా వొక్క కేక వేశాడు. జనం అంతా ముక్తకంఠంతో 'యల్లమందయ్యకే మావోటు' అంది.

పల్లెనుంచివచ్చిన వాళ్ళంతా గ్రామచావిట్లోకి పోయి వోమూల వదిగి కూర్చున్నారు.

అంతలోకి ఎలక్షన్ ఆఫీసరుగారు తన సిబ్బందితో వచ్చి కూర్చొన్నారు. ఆ వెనకే పరంధామయ్యగారు ఆయన మనుషులు వచ్చారు.

నారాయణ, కోటయ్య, రామయ్య, పుల్లయ్య మొదలుగాగల తన మనుషుల్ని హెచ్చరించాడు.

ఆఫీసరుగారు సావిట్లోకూర్చున్న జనాన్ని ఓసారి కలియజూచి అభ్యర్థుల పేర్లు చదివాడు.

జనంలో కలకలం బయలుదేరింది.

"ఓరేయ్! ఎర్రాడోయ్! నల్లోడోయ్! యంకిటిగా! మన యల్లమందయ్య పేరు లేచినప్పుడు..."

'ఓయ్ కోటయ్యా! పుల్లయ్యా! మనోళ్లంతా ఎక్కడ?"
కేకలు సావిటికప్పు దూసుకుపోతున్నాయి.

'సైలెన్సు! ఎవరూ మాట్లాడకూడదు!' ఆఫీసరు జనాన్ని అదమాయించాడు.

ఆఫీసరు పరంధామయ్య పేరు ముందు చదివాడు. జనంలోంచి వొహడు లేచి "అయ్యా! ముందు యల్లమందయ్య పేరు రావాల్సింది!" అన్నాడు.

పరంధామయ్య లేచి ఆఫీసరు కూర్చొన్న బల్లదగ్గిరకొచ్చి ఆయన చెవిలో గుసగుసలాడాడు.

ఆఫీసరుగారులేచి "పరంధామయ్యగారికి వోటు యిచ్చేవారంతా చేతులెత్తండి!" అన్నారు.

వో మూలనుంచి ముందు పదిచేతులు లేచినై. ఆఫీసరు మళ్ళీ గట్టిగా అన్నాడు; 'పరంధామయ్యగారికిచ్చే వోటర్లంతా చేతులెత్తాలి!'

పరంధామయ్య మీసందువ్వుకుంటూ జనం మధ్యలో వున్న రామయ్య పుల్లయ్యలకేసి చూశాడు. రామయ్య పుల్లయ్యలు మొహామొహాలు చూసుకొన్నారు. ముందు పుల్లయ్య చెయ్యెత్తాడు వంకరగా. వెంటనే రామయ్యా చెయ్యి సాగదీసి ఎత్తేశాడు. తర్వాత ముప్పైఫె నలభై చేతులు జనంమధ్యనుంచి లేచినై.

నారాయణ దేవయ్య ముహంవేసి కోటయ్యకేసి చూశాడు.

పరంధామయ్యగారు సకిలించి పెడగా కూర్చొన్న పల్లె జనంవైపు కోరచూపులు చూశారు. అలా పర్వతంలా నుం

చొన్న పరంధామయ్యగారి కోరచూపులు ఎవరికి మట్టుకు వాళ్ళకు తమమీదే పడ్డట్టయింది!

ముందు ఎంకిటిగాడు చెయ్యి ఎత్తేశాడు. తర్వాత పిల్లి సుబ్బడూ, ఎర్రోడూ, నల్లోడూ, కర్రోడూ చేతులెత్తారు. దాంతో యాభై అరవై చేతులు గలిబిలిగా లేచినై.

ఆఫీసరుగారు మొత్తం లెక్కేసి 'రెండువందల యిరవై మూడు' అని రాసుకొన్నాడు.

ఏసోబు పళ్ళుకొరుక్కొంటూ పల్లెజనంవైపు చూశాడు. యెల్లమందయ్య అయోమయంగా పరంధామయ్యకేసి, ఆఫీసరుకేసి, జనాన్ని వూరికే చూస్తో వుండిపోయాడు. నూటయిరవై వోట్ల మెజారిటీతో పరంధామయ్యగారు ఉల్లిపాలెం పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా ఎన్నుకోబడ్డారు.

గ్రామ చావిట్లోంచి జనం కదిలి వెళ్ళిపోతూన్నారు. నారాయణ దోవలో తన కులంవాళ్ళనుచూసి అడిగాడు.

'అట్లా చేశారేం పుల్లయ్య మామా!'

'ఏం చేస్తాంవోయ్ నారాయణా! పరంధామయ్య పల్లపుచేను ఈ యేడు నేనేగా చేస్తుంది!'

"రామయ్య బావోయ్! పెద్దోడివి నువ్వుకూడా పుట్టి ముంచావ్ కదే?"

"అట్లా వచ్చిందిరా అబ్బాయ్! ఈ మధ్య ఆయనతో ఓ లిటికేషన్‌లో యిరుక్కోవాల్సివచ్చింది! ఆ ఫోర్జరీ దస్తావేజు సంగతి నీకు తెలియందేముంది?" అన్నాడు రామయ్య నారాయణ్ని సముదాయించుతూన్నట్టుగా.

పరంధామయ్యకు చేను తాకట్టుపెట్టిన రామస్వామీ, కాడిగట్టు వెంకయ్యా, ఇంకా నారాయణకులం వాళ్ళల్లోనూ,

అప్పుల్లోనూ, పరంధామయ్యగారితో ఏదోరకంగా లావాదేవీ లున్న వాళ్ళు; అంతో యింతో నంజినవాళ్లు నారాయణకు ముఖం చూపించకుండానే యిల్లు దూరారు.

ఊళ్ళనుంచి పల్లెకు పోతూన్న జనాన్ని పెద్ద కాలవ కట్టమీద నిలేసి అడిగాడు ఏసోబు.

"అదేందిరా దొంగనాయల్లారా అట్టాచేశారు ?"

"ఏం చేయమంటావ్ ఏసోబయ్యా? ఆసామి ఆవజాన ఎలుగొడ్డల్లే నుంచొని సూ త్తంటే ?" అన్నాడు ఎంకిటిగాడు.

"అవును ఎల్లమందయ్యా! తెల్లారిలే త్తే బతికేది ఆరికాళ్ళ ముంగరకదంటవా !" అన్నాడు నల్లోడు.

"అవునెస్ ! నా పెద్దోడు ఆరింట్లో జీతాని కుండాడు ! ఎట్టా శయ్యాత్తకుండా వుంటానశ !" అన్నాడు చింతడు. వరుసగా ఒక్కొక్కళ్ళే బయటపడ్డారు—

'ఆరిపాగతోటకి నీళ్ళుపోసేది నేను గదశా ?'

"మా అడది ఆరి బీట్లోనేగందా గడ్డి గీకుద్ది ?"

"నా ఎండిమురుగులు తాకట్టు పెట్టింది ఆరిదగ్గరే !"

"ఆరి ఇటికాంకి కాపలా నేనేగదింటయ్యా !"

"ఆ సామి సున్నం గానుగుతోలేది ఎవురస్ !"

"నేను గుడిశేసుకోంది ఆరి సోట్లో గాదంటయ్యా ఏసోబయ్యా !"

"తప్పుడు నాయాల్లారా! నోరు మూసుకోండశ !" గదమాయించాడు ఏసోబు కోపంగా.

"అదిగాదయ్యా ఏసోబయ్యా! మనోళ్ళంతా ఎత్తేసరికి నేనుకూడా నాది ఎత్తేశానశ !" అన్నాడు ఎర్రిగాడు.

"అసలు యవ్వారం గలిబిలి అయిపోయిందిలే!" అన్నాడు ఎర్రోడు.

"ఎల్లమంద య్యోయ్! యీళ్ళమాటలు నమ్మకాక య్యోయ్! దొంగనాయాళ్ళు! ఎంకిటిగాడు ఆరింటికాడ యాటమాంసం తిన్నొచ్చాడయ్యా నిన్న" చెప్పాడు చిన్నోడు.

"వట్టిదేలేవయ్యా! పిల్లసుబ్బడు పాతికరూపాయలు తీసుకొన్నాడు ఆసామిగారిదగ్గిర" అన్నాడు ఎంకిటిగాడు సుబ్బడిని దొంగచూపులు చూస్తూ.

"వోరు తీసుకోలేదియ్యా? అందరూ తీసుకొన్నోళ్ళే! ఆ కాడికొత్తే నారాయణయ్యగారి మనుసులుకూడా తీసుకొన్నోళ్ళే!"

"ఏడిశాల్లే ఎదవముండనాయాళ్లు!" కసిరాడు ఏసోబు. జనం కాసేపు మాట్లాడకుండా నడిచారు.

"ఎల్లమందయ్యా! నువ్వన్నా సెప్పలేదేమయ్యా? సెయ్యెత్తేప్పుడు పరంధామయ్యగారొచ్చి సూత్తారని?" అన్నాడు ఎంకిటిగాడు మెల్లిగా.

"అవునన! ఆర్ని సూత్తంతోటే బెదురేసి పోయింది!" ఎర్రోడన్నాడు.

"అది సరేగాని సోబయ్యా! పెద్ద ఎలకును మాదిరిగా అయితేనే యీలుగావుండేదియ్యా!"

"ఆఁ! అట్టయితే ఆరికో వోటు పోయేదంటియ్యా! అన్నీ మన ఎల్లమందయ్యకి పడేయి కావూ!"

"ఇప్పుడీ శేతులెత్తటం వోరుపెట్టినట్టు ఏసోబూ!"

అంతలో కాలవకట్ట తుమ్మచెట్లచాటునుండి కేకలు విన పడి ఏసోబువాళ్ళంతా వెనక్కు చూశారు. కాలవదాటి నలుగురు వ్యక్తులు చావుబతుకుల్తోవచ్చి ఏసోబువాళ్ళను కలుసుకొన్నారు. ఆ నలుగురికీ తలమీదా బుజాలమీదా గాయాలున్నాయ్! మొహంమీదా గుడ్డలమీదా రక్తంమరకలు యింకా ఆరిపోలేదు! ఆ నలుగురూ ఎల్లమందయ్యకు వోటు చేసినవాళ్ళు. వూళ్ళోకిపోయి వెనక చిక్కునవస్తూండగా పరంధామయ్య మనుషులు అడ్డంతగిలారు.

"ఏం జరిగిందిరా?" ఎల్లమందయ్య ఆదుర్దాగా అడిగాడు.

"ఆడి మనుసులు! తుమ్మబీట్లోకొచ్చేసరికి కర్రలు తీసుకొని మీదబడ్డారు! వోడికిరా మీరు చేతులెత్తిందని!"

"నాయాళ్ళని పేణంతీసేద్దుం! చేతిలో ఏం లేకపోయిందిగాని!'' అన్నాడు వొకడు ముహం మీదకు కారుతున్న రక్తం తుడుచుకుంటూ.

పుల్లడి తలమీద తగిలిన గాయంనుంచి కారుతూన్న రక్తానికి చెయ్యి నొక్కిపట్టి ఎల్లమంద పారిపోతూన్న పరంధామయ్య మనుష్యులకేసి చూశాడు—

—పల్లెజనం తెలియని బాధా సిగ్గుతో కుంగిపోయారు. వాళ్ళహృదయాల్లో తీరని అశాంతీ ప్రతీకారేచ్ఛా రేకెత్తింది! అంతా మౌనంగా గాయపడ్డమనుషుల్ని దీసుకొని పల్లెవైపు నడిచిపోయారు.

ఎలక్షన్ అయిపోయాక ఆఫీసర్ను విడిదిలో దిగబెట్టి రావటానికి బయలుదేరాడు పరంధామయ్య.

దారిలో ఆఫీసరు అన్నాడు.

"చూడండీ పరంధామయ్యగారూ! పోయిన పార్లమెంట్ ఎన్నికల్లో మీకు మీ వూళ్ళో ముప్పై ఓట్లుకూడా రాలేదే? మరి యిప్పుడు మూడువందలదాకా వచ్చినై య్యే?"

"ఏదో తమదయ! ఇంకోసంగతి. అప్పుడంతా 'మీకే ఇస్తాం మీకేఇస్తాం' అని తిన్న విశ్వాసంకూడా లేకుండా మోసంచేశారు."

"ఓహో అలాగా?"

"అవునండయ్యా! ఎవు డెవరికేసిందీ తెలియకుండా వచ్చింది. అదేమంటే, దొరోయ్! మీకే వేశాం అనేవాళ్లు! అప్పుడంతా సీక్రెట్ బాలెట్ అయిపోయే! మనుషుల్లో నిజాయితీ పోయింది!"

"అయితే చేతులెత్తటం పద్ధతే మంచిదంటారా పరంధామయ్యగారూ?"

"మెల్లిగా అంటారేమండీ? మంచిదా మరీ మంచిదా? చూశారూ! మనుషుల్లో నిజాయితీ పెరుగుతుంది. మనదగ్గర యింతో అంతో గతికిన గాడిదెవడూ మళ్ళీ తప్పుడుకూడు కుడువటానికి వీలుండదు చూడండీ?"

'మహాబాగా చెప్పారు."

'ఎసంబ్లీ ఎలక్షన్‌లల్లోకూడా చేతులెత్తేపద్ధతే బాగుంటుందేమో?'

"ఒక ఎసంబ్లీ ఏమిటి పరంధామయ్యగారూ? నన్నడిగితే పార్లమెంటూ, ప్రసిడెంటు ఎన్నికకుకూడా చేతులెత్తే పద్ధతే మంచిదంటాను. ప్రజాస్వామ్యంలో యిన్నిరకాల ఎలక్షన్లేమిటి?"

"అవునండయ్యా అన్నిటికీ చేతులెత్తేపద్ధతి పెట్టేస్తే పోతుంది."

"ఆమాటకొస్తే హైకోర్టుకూడా చేతులెత్తటం ప్రజాస్వామ్యానికి విరుద్ధకాదని తీర్పుయిచ్చింది గాదుటండీ!"

"అవునండిసార్! ప్రజాస్వామ్యం అంటే ప్రజలు సౌమ్యులుగా వుండాలని కదండీ తాత్పర్యం!"

"ఆహాహః. పరంధామయ్యగారూ! ముడికాస్తా విప్పేశారు. ప్రజాస్వామ్యతత్వం ముడికాస్తా విప్పేశారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలు సౌమ్యులుగా నడవడం! ఓహోహో మరి రేప్రొద్దున బండికే పోతా! రాత్రికనిపిస్తారుగదూ?"